

రూరల్ సీఐ శ్రీను బదిలీ

సిద్దిపేటరూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) ; సిద్దిపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను మల్టీ జోన్-1కు బదిలీ అయ్యారు. రెండేళ్లుగా సిద్దిపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సేవలందించారు. సిద్దిపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మల్టీ జోన్-1 లో వెయిటింగ్‌లో ఉన్న నవీన్ బదిలీపై వచ్చారు. త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.



మణిద్వీప వర్ణపూజ

కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తిపీఠంలో హైదరాబాద్‌కు చెందిన మంచికంటి జ్యోత్స్న ఆధ్వర్యంలో సామూహిక మనిద్వీప వర్ణపూజ శుక్రవారం నిర్వహించారు. 300 మంది మహిళలు పాల్గొని స్తోత్రాలను వినిపించారు. అమ్మవార్లకు చీరల సమర్పణ, 18 మంది సుకన్యలకు పూజలు చేశారు.

- కొండపాక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి)

ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించిన జగ్గారెడ్డి



సంగారెడ్డిలోని ఐబీ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని సంగారెడ్డిలోని ఐబీ గెస్ట్ హౌస్ వద్ద ఉన్న ఇందిరా విగ్రహానికి శుక్రవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ తెచ్చిన సంస్కరణలు పేదలకు మేలు చేశాయన్నారు. బ్యాంకులను జాతీయం చేసి అన్నివర్గాల ప్రజల గుండెల్లో నిలిచిపోయారని గుర్తు చేశారు.

వల్లభాయ్ పటేల్ విగ్రహానికి..

మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సంగారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి జూలకంటి ఆంజనేయులు, నాయకులు కూన సంతోష్, మహేష్, వెంకట్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేపల మార్కెట్‌లకు నిధులు కేటాయించాలి

- కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమలశాఖ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్‌ను కోరిన ఎంపీ రఘునందన్‌రావు

7



హుస్నాబాధ తెలుసుకునేలా

- వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నంతో కలిసి సీఎం ఏరియల్ సర్వే
- వరద నివారణకు అధికారుల సర్వే.
- ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్/మద్దూరు/రాయపోల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టంతోపాటు పట్టణం జలమయం అయిన నేపథ్యంలో, శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా, మంత్రి పొన్నం ప్రభాకర్ ఏరియల్ సర్వే నిర్వహించారు. అలాగే నష్టనివారణ, శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేయగా, మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేశారు.

సీఎం ఏరియల్ వ్యూ..

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి హెలికాప్టర్ ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. కోహెడ మోయతుమ్మెద వాగు పరిసరాలు, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, మినీ స్టేడియం, మార్కెట్ యార్డుతో పాటు అక్కన్నపేట మండలం మోత్కులపల్లి వరద ప్రాంతాలను (యువజంట కొట్టుకుపోయిన ప్రాంతం) పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలు, తెగిపోయిన కల్వర్టులు, రోడ్లను సైతం వారు ఏరియల్ వ్యూ ద్వారా వీక్షించారు.

పబ్లిక్ హెల్త్ అధికారుల సర్వే

ప్రతి వర్షానికి హుస్నాబాద్ పట్టణాన్ని

మిగతా 8వ పేజీలో

కో అంటే టి..!

నిన్నటిదాకా మద్యం షాపులకు అధికారికంగా లాటరీ నిర్వహించారు. ఇప్పుడేమో ఆ షాపులు దక్కినవారు అధిక ధరకు విక్రయించేందుకు అనధికారిక వేలం చేపడుతున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన తరహాలోనే ఈసారి కూడా మద్యం షాపులను భారీ ధరకు అమ్మకానికి పెడుతున్నారు. డిసెంబరు ఒకటో తేదీ నుంచి కొత్త షాపులు ప్రారంభించే లోపు ఒప్పందాలు చేసుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

- అమ్మకానికి మద్యం దుకాణాలు!
- ఎవరు ఎక్కువ ధర చెబితే వారికే..
- రూ.3లక్షలకు దక్కిన వైన్‌షాపుల వేలం
- లైసెన్స్ దక్కిన వారితో బేరసారాలు
- పటాన్‌చెరులో రూ. కోటిన్నరకు రీసేల్
- రూ. 2కోట్లకు మరో రెండుషాపుల డీల్
- గజ్వేల్, దుబ్బాక, మెదక్, సిద్దిపేటలోనూ రూ.75లక్షలకు బేరం



సిద్దిపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లాలో 101, సిద్దిపేటలో 93, మెదక్‌లో 49 మద్యం షాపులకు అక్టోబరు 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఇదే నెల 27న డ్రా పద్ధతిన కొత్తషాపులకు యజమానులను ఎంపిక చేశారు. ఉత్కంఠభరితంగా జరిగిన ఈ డ్రా పద్ధతిన కొందరికి అనూహ్యంగా షాపులు దక్కగా.. సిండికేట్‌గా మారి పదుల సంఖ్యలో దరఖాస్తులు వేసిన ఇంకొందరికి ఒక్క షాపు సైతం దక్కలేదు. దీంతో అధిక డబ్బులు వెచ్చించైనా ఒక్క దుకాణమైన దక్కించుకోవడానికి కొత్తషాపుల నిర్వాహకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

డబుల్ అదృష్టవంతులు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 243 మద్యం షాపులు ఉంటే రూ.3లక్షల చొప్పున చెల్లించి 8,634 మంది దరఖాస్తులు చేశారు. ఒక్కో షాపునకు సగటున 36 మంది పోటీపడ్డారు. వీరిలో ఒక్కరికి మాత్రమే వైన్ షాపు దక్కడంతో అదృష్టవంతులుగా మారారు. కాగా రూ.3లక్షలకే షాపు రావడం ఒక ఎత్తయితే.. వచ్చిన దుకాణాన్ని ఇతరులకు అధిక ధరకు విక్రయించడం మరింత అదృష్టాన్ని తెచ్చినట్లయ్యింది. మద్యం వ్యాపారంలో అనుభవం లేనివారు తమ షాపులను విక్రయించాలని చూస్తున్నారు.

రూ. కోటి నుంచి రూ. 2కోట్ల వరకు..

రెండేళ్ల కిందట రూ. 2లక్షల ఫీజు చెల్లించి షాపులు పొందినవారు అత్యధికంగా రూ. 80లక్షల వరకు విక్రయించినట్లు తెలిసింది. ఈసారి దరఖాస్తు ఫీజును పెంచినా

మిగతా 7వ పేజీలో

ఆక్రమణలో నల్ల(కొండ)పోచమ్మ చెరువు!

- సర్వేలు, పరిశీలనలతోనే సరి
- గతంలోనే చెరువు ఎఫ్‌టీఎల్ ఆక్రమణల నిర్ధారణ
- యేళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకోవడంలో నీటిపారుదలశాఖాధికారులు తాత్సారం..
- ప్రమాదంలో చెరువు ఉనికి
- సుందరీకరణకు గతంలో మాజీ సీఎం కేసీఆర్ హామీ



కొండపోచమ్మ ఆలయ ఎదురుగా నల్ల(కొండ)పోచమ్మ చెరువు

చేర్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చినా... ఏళ్లు గడుస్తున్నా.. నల్లపోచమ్మ చెరువు పునరుద్ధరణ కలగానే మిగిలింది. కళ్లెదుటే ఆక్రమణలకు గురవుతున్నా.. నీటిపారుదల శాఖాధికారులు సర్వేలు, పరిశీలనలకే పరిమితమవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎఫ్‌టీఎల్ ఆక్రమణల ను నిర్ధారించినా చర్యలకు వెనుకాడటం వెనుక తాత్సారం దాగి ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేర్యాల మండలం నాగపురి గ్రామపరిధిలోని నల్ల (కొండ) పోచమ్మ చెరువు ఆక్రమణల విషయంలో నీటిపారుదల శాఖాధికారులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంపై స్థానికులు మండిపడుతున్నారు. పూర్వ వరంగల్, మెదక్ జిల్లాల సరిహద్దు సమస్యగా ఉండేది. ఎనిమిదేళ్ల క్రితం సిద్దిపేట జిల్లా పరిధిలోకి వచ్చినా ఈ చెరువు సమస్య ఏమాత్రం పరిష్కారానికి నోచుకోకపోవడం వివాదాస్పదమవుతోంది.

కొండపోచమ్మ దేవాలయ దర్శనానికి వచ్చే భక్తులకు పుణ్యస్నానాలకు అనువుగా ఈ చెరువును మార్చేందుకు గతంలో మాజీ సీఎం కేసీఆర్ సంకల్పించి నిధులు ప్రకటించారు. అయినప్పటికీ, పలువురి ఆక్రమణలు, కొందరి స్వార్థం కారణంగా ఆ సంకల్పం కార్యరూపం దాల్చలేదు. అధికారులు మారుతున్నారే తప్ప చెరువు పునరుద్ధరణకు మాత్రం నోచుకోవడం లేదు.

ప్రమాదంలో చెరువు ఉనికి

నాగపురి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 831లో ఉన్న ఈ చెరువు 22.02 ఎకరాల్లో విస్తరించి ఉంది. 31-03 ఎకరాల శిఖం, 150 ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. కట్టపై నల్లపోచమ్మ అమ్మవారి దేవాలయం ఉండటం వల్ల నల్లపోచమ్మ చెరువుగా, అలాగే కొండపోచమ్మ దేవాలయానికి ఎదురుగా ఉండటం వల్ల కొండపోచమ్మ చెరువుగా పిలుస్తున్నారు. యేటా 3 నెలల పాటు జరిగే జాతర కారణంగా లక్షలాదిగా భక్తులు తరలివస్తుంటారు. ఈ ప్రాంతంలో వ్యాపారం జోరుగా సాగుతుండటం, చుట్టూ గుట్టలు ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగింది. పలువురు ఆక్రమణదారుల కన్ను చెరువు శిఖం భూమిపై పడింది. కొందరు దుకాణాల కోసం, మరికొందరు ప్లాట్ల వెంచర్ల కోసం, ఇంకొందరు రాజకీయ పలుకుబడితో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి చొచ్చుకు వస్తున్నారు.

మొక్కుబడిగా పరిశీలనలు

నాగపురి వాసులు చాన్నాళ్లుగా ఆందోళనలు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తున్నా, అధికారులు కేవలం వివాదాలు చెలరేగినప్పుడో లేదా ఫిర్యాదుల అందినప్పుడో వచ్చి పరిశీలనకే పరిమితమవుతున్నారు తప్ప, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు. గతంలోనే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి, శిఖం భూములను సర్వే చేసి, ఆక్రమణలను గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. కానీ, తదుపరి చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణదారులు మళ్లీ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి, మొరం పోస్తూ చొరబాటు కొనసాగిస్తున్నారు. చెరువును పునరుద్ధరిస్తే భక్తుల పుణ్యస్నానాలతో పాటు ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. కానీ, ప్రస్తుతం చెరువు పరిరక్షణ లేక మట్టి, మొరం, వ్యర్థాలను పారబోయడం వల్ల కంపు కొడుతూ భక్తులకు

మిగతా 8వ పేజీలో



విద్యార్థులకు వ(బు)రద కష్టాలు

చేర్యాలలో రెండు రోజులుగా కురిసిన వర్షాల వల్ల వరద నీరు ప్రవహించడంతో పలు పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కడవేరుగు దారి నుంచి వరద నీరు మళ్లే కుడిచెరువు నాలాలు ఆక్రమణకు గురవడంతో పెద్దచెరువు నీరు మత్తడి నీరు ఖాళీ ప్రదేశంలో చేరింది. వరద తగ్గినా దారులు బురదమయంగా మారడంతో పట్టణంలో పలు పాఠశాలు, కళాశాల విద్యార్థులు అవస్థలు పడ్డారు.

- చేర్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి)

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో

విద్యార్థి ఆత్మహత్య

- వసతిగృహంలో ఉరేసుకున్న బానోత్ మహేందర్
- మృతుడిది సూర్యాపేట జిల్లా పెద్దరాజు తండా

7

ఉపాధి వేట..

గుమ్మడిదల బాట

- వ్యవసాయ, పారిశ్రామిక పనులకు నిలయం
- కానుకుంట చౌరస్తాకు వందల మంది కూలీల రాక
- మహిళా కూలీలకు ఆర్టీసీ ఉచిత సేవలతో ఊరట

7

నీటి బకెట్‌లో మునిగి చిన్నారి మృతి


ఉచిత (ఫైల్)

చిన్నశంకరంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బుడిబుడి అడుగులతో సందడి చేసిన చిట్టితల్లికి అప్పుడు నూరేళ్లు నిండిపోయాయి. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన స్వప్నకు 18 నెలల చిన్నారి ఉచిత ఉంది. తల్లి రోజులానే శుక్రవారం సాయంత్రం ఇంట్లో పనులు చేసుకుంటుండగా, ఉచిత ఆడుకుంటూ వెళ్లి నీటి బకెట్‌లో పడింది. పాప కనిపించకపోవడంతో వెతకగా, బకెట్‌లో విగతజీవిగా కనిపించింది.

అటకెక్కిన చెత్త సేకరణ

- విజృంభిస్తున్న దోమలు, క్రిమికీటకాలు
- దుర్వాసనతో సతమతమవుతున్న ప్రజలు
- నిమ్మకు నీరెత్తని అధికారులు

కంది, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న కంది మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతకు మంగళం పాడారు. శుక్రవారం కందిలోని ప్రధాన రహదారుల్లో, రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో, మండల పరిధిలోని చిమ్నాపూర్ గ్రామ శివారులో ఉన్న మోదంకుంటలో పంచాయతీ సిబ్బంది కుప్పలు తెప్పలుగా చెత్తను పారబోయడం కలకలం రేపింది. అంతేగాక ఆ చెత్తలో మిగిలిన ఆహార పదార్థాలను పందులు తింటూ, అవి వీధుల్లో సంచరిస్తూ రోగాలను వ్యాప్తి చేస్తున్నాయి. కంది మండలానికి కొత్తగా చెత్త గండం వచ్చి పడిందని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కొన్ని రోజులుగా కందిలోని ఇళ్ల వద్ద నుంచి, దాబాల నుంచి, ఫంక్షన్ హాళ్ల నుంచి, హోటళ్ల నుంచి, దుకాణ సముదాయల నుంచి సేకరించిన చెత్తను రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టుపక్కల అసైన్డభూమిలో పారబోస్తున్నారు. పారబోసిన ఆ చెత్తను తగలబెట్టడంతో వచ్చే పొగతో పాటు చెత్త నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేక రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే క్రయవిక్రయదారులు సతమతమవుతున్నారు. మండల పరిధిలోని కాశీపూర్, చేర్యాల, ఎద్దుమైలారం, కవలంపేట, ఎర్దనూర్, బ్యాతోల్, ఆరుట్ల, చిద్రుప్ప, బేగంపేట, ఉత్తర్‌పల్లి, మక్తాఅల్లూరు, కంది, చిమ్నాపూర్, చెర్లగూడెం, తోపుగొండ తదితర గ్రామాల్లో చెత్త సేకరణ అటకెక్కింది.


కంది శివారులోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద పారబోసిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు

పేరుకే డంపుయార్డులు..

గ్రామాల్లో చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు ఏర్పాటుచేసిన డంపుయార్డులు నిరుపయోగంగా మారాయి. ఆయా గ్రామాల్లో సేకరించిన చెత్తను ఇష్టారీతిన రోడ్లపక్కల పారబోస్తున్నారు. ఈ విషయమై వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చెత్త సేకరణను సక్రమంగా చేసేలా చర్యలు తీసుకోవాలని కంది మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వరదల్లో గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం

అక్కన్నపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మోత్కులపల్లి వాగుదాటుతుండగా బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు గల్లంతు కాగా వారి మృతదేహాలు శుక్రవారం లభించాయి. అదే రోజు అక్కన్నపేట మండలం దారునుతి వాగులో వరద ఉధృతికి గల్లంతయిన మరో యువకుడి మృతదేహం కూడా శుక్రవారం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే మూడు రోజులుగా తుపాన్ ప్రభావంతో వరదల దాటికి అక్కన్నపేట మండలంలో ముగ్గురు వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందారు. బుధవారం రాత్రి అక్కన్నపేట మండలం మోత్కులపల్లి వాగు దాటుతుండగా బైక్‌పై వెళ్తున్న ప్రణయ్, కల్పన గల్లంతయ్యారు. వీరు భీమదేవరపల్లి మండలం నుంచి అక్కన్నపేటకు వస్తుండగా మల్లారం వద్ద భారీ వర్షం కారణంగా వరదనీరుతో రోడ్డు కట్ అయింది. దీంతో వేరే దారి గుండా వెళ్తుండగా బుధవారం రాత్రి మోత్కులపల్లి వద్ద వాగులో కొట్టుకుపోయారు. ఉదయాన్నే పొలం వద్దకు వెళ్లిన వారు చెరువు సమీపంలో బైక్ కనిపించడంతో బండి నెంబర్ ద్వారా ఎవరని తెలుసుకోగా బండి నెంబర్ ఆధారంగా భార్యాభర్తల అచూకీ తెలిసింది. గల్లంతయిన వారి కోసం రెండు రోజులుగా వాగు సమీపంలో ఎన్‌డీఆర్ఎఫ్ రిస్క్‌టీంలు గాలించగా శుక్రవారం ఉదయం భార్యాభర్తల మృతదేహాలు లభించాయి.


మోత్కులపల్లి వరదలో గల్లంతైన భార్యాభర్తలు (ఫైల్)

మరోయువకుడు..

అక్కన్నపేట మండలం మల్లంపల్లి వాగులో బుధవారం రాత్రి వరద ఉధృతికి ద్విచక్రవాహనంతో పాటు ఓ యువకుడు కొట్టుకుపోయి గల్లంతయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువకుడి మృత దేహం శుక్రవారం ఆలస్యంగా బయటపడింది. యువకుడు మల్లంపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి రామకృష్ణ(27)గా గుర్తించారు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై హుస్నాబాద్ వస్తుండగా మల్లంపల్లి శివారులో వాగుదాటుతుండగా వరద ప్రవాహంలో కొట్టుకుపోయనట్లు తెలిసింది. యువకుడికి 5 నెలల క్రితమే వివాహం జరిగింది. శుక్రవారం ముగ్గురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ఆసుపత్రికి తరలించారు.


రామకృష్ణ (ఫైల్)

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడులు

- 12 లీటర్ల మద్యం సీజ్

దుబ్బాక అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న బెల్ట్ షాపులపై శుక్రవారం దుబ్బాక పోలీసులు దాడిచేసి, 12 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దుబ్బాక ఎస్సై కీర్తిరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద 2, పోస్టాఫీస్ సమీపంలో ఒకటి, పట్టణ కేంద్రంలో మరోక బెల్ట్‌షాపులో దాడులు నిర్వహించారు. మద్యం దుకాణాలల్లో అక్రమంగా నిల్వఉంచిన 12లీటర్ల వివిధ బ్రాండ్ల మందు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ...అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన, విక్రయించిన , బెల్ట్‌షాప్ నిర్వహించిన ఉపేక్షించేదే లేదని హెచ్చరించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పనిచేయడానికి ఎల్లవేల కృషిచేస్తామన్నారు.

పాఠశాలలో నాగుపాము కలకలం

- పరుగులు తీసిన విద్యార్థులు
- గడిపెద్దాపూర్ ఉన్నత పాఠశాలలో ఘటన

అల్లాదుర్గం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదు అడుగుల నాగుపాము పాఠశాల తరగతి గదిలోకి దూరి కలకలం రేపింది. ఇంత పెద్ద పామును చూసిన విద్యార్థులు అరుపుల కేకలతో పరుగులు పెట్టారు. ఈ ఘటన శుక్రవారం మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఇలా ఉన్నాయి. పాఠశాలలోని పదో తరగతి గదిలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠం బోధిస్తున్న తరుణంలో సుమారు ఐదు అడుగుల నాగుపాము తరగతి గదిలో సంచరిస్తున్న దృశ్యం కంటపడింది. దీంతో విద్యార్థులకు చెప్తూ అప్రమత్తం చేయడంతో విద్యార్థులు అరుస్తూ, కేకలు వేస్తూ తరగతి గది నుంచి పరుగులు తీశారు. గ్రామస్థుల సహకారంతో ఆ పామును కర్రల సహాయంతో ఆరుబయటకు తరలించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.


గడిపెద్దాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నాగుపామును బయటకు తరలిస్తున్న విద్యార్థులు

నాలుగు రోజుల క్రితం..

అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత (బాలికల) పాఠశాలలోను ఓ నాగుపాము కలకలం రేపింది. తరగతి గది పక్కనే ఉన్న వంట గదిలో సంచరిస్తున్న ఓ నాగుపాము విద్యార్థుల కంట పడింది. దీంతో నిర్వాహకులు స్థానికులకు సమాచారం అందించి ఆ పామును ఇతర ప్రాంతానికి తరలింపచేయడంతో నిర్వాహకులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు

ఒకే రోజు రెండు పెద్దమ్మ ఆలయాల్లో చోరీ

రాయపోల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఒకే రోజు రెండు పెద్దమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన రాయపోల్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అనాజీపూర్ గ్రామంలోని పెద్ద చెరువు కట్ట వద్ద ఉన్న పెద్దమ్మ ఆలయాన్ని గురువారం రాత్రి గ్రామానికి చెందిన మహిళలు ఆలయం వద్దకు శుభ్రం చేయడానికి వెళ్లారు. గేటు తాళాలు పగలగొట్టడంతో పాటు లోపల హుండీ పగలగొట్టి ఉన్నాయి. హుండీలో ఉన్న సుమారు రూ. 5వేలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు గ్రామానికి చెందిన నీల స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా ఈ ఆలయంలో ఇది రెండోసారి జరిగిన చోరీ. ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.


అనాజీపూర్ పెద్దమ్మ ఆలయాన్ని పరిశీలిస్తున్న గజ్వేల్ ఏసీపీ నర్సింహులు

మరో సంఘటనలో..

లింగారెడ్డిపల్లి మసీదు గడ్డ వద్ద ఉన్న పెద్దమ్మ ఆలయంలో గురువారం సాయంత్రం దీపం పెట్టడానికి వెళ్లిన మహిళకు ఆలయం తాళాలు పగులగొట్టి ఉండడం గమనించింది. ఈ విషయమై గ్రామస్థులకు తెలియజేయగా వారు వెళ్లి పరిశీలించి అమ్మవారి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు, మెట్టెలు, 15 తులాల వెండి హారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు గ్రామానికి చెందిన మంద నర్సింలు రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, తొగుట సీఐ లతీఫ్, ఎస్సై మానసలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో మాజీ ఎంపీపీ తనయుడి మృతి

నారాయణఖేడ్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మాజీ ఎంపీపీ దివంగత బాల్‌కిషన్ కుమారుడు కాలేరు చరణ్(40) శుక్రవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చరణ్ మండల కేంద్రమైన నిజాంపేటలో మీసేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. చరణ్‌కు భార్య సౌజన్య, కూతురు, కుమారుడు ఉన్నారు.


కాలేరు చరణ్(ఫైల్)

విద్యుదాఘాతంతో రైతు..

మర్కుక్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో సత్తయ్య అనే రైతు గురువారం మధ్యాహ్నం కరెంట్ వైరు తగిలి మృతి చెందాడు. ఎస్సై దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన చెన్ రాజు సత్తయ్య(55) వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం బోరు బావి దగ్గరికి వెళ్లి వస్తానని వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో సత్తయ్య కుటుంబ సభ్యులు బావి దగ్గరికి వెళ్లారు. అప్పటికే కరెంట్ వైర్ తగిలి షాక్‌తో మృతి చెందినట్లు నిర్ధారించారు. సత్తయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం కొరకు గజ్వేల్‌లోని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై దామోదర్ తెలిపారు.

వృద్ధ రైతు ఆత్మహత్య

రామయంపేట,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వృద్ధ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన రామాయంపేట మండలం వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన క్యాదరి నరసయ్య(67) శుక్రవారం శవమై కనిపించాడు. గ్రామ శివారులోని ఓ చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని పలువురు గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. రెండు రోజులు కావడంతో శవం కుళ్లిపోయి ఉంది. మృతుడి కుమారుడు తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు అయింది.

యువకుడిని కాపాడిన పోలీసులు

కొమురవెల్లి,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంసాగర్ గ్రామానికి చెందిన కోటి అనే యువకుడు తండ్రి మందలించాడని ఆత్మహత్య చేసుకోబోయాడు. గంగుల లచ్చయ్య తనకు తెలియకుండా రెండు గొర్రెలను అమ్మినందుకు తన కుమారుడు గంగుల కోటిని మందలించాడు. శుక్రవారం ఇంటి నుంచి బయటకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నాను అని ఫోన్ చేశాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు 100కు ఫోన్ చేసి విషయం చెప్పగా డ్యూటీలో ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించారు. యువకుడి ఫోన్ లోకేషన్ ఆధారంగా తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి యువకుడిని రక్షించారు. యువకుడికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి తండ్రికి అప్పగించారు. ఆపదలో సత్వరమే స్పందించి యువకుడి ప్రాణాలను కాపాడిన పోలీసులను పలువురు అభినందించారు.


యువకుడిని కాపాడి తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు





సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ పంకజ్, అదనపు ఎస్పీ రఘునందన్, అధికారులు, సిబ్బంది



మెదక్ పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీలో విద్యార్థులతో కలెక్టర్ రాహుల్‌రాజ్



సిద్దిపేటలో నిర్వహించిన 2కే రన్‌లో సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, అధికారులు, యువకులు

సమైక్యతా ర్యాలీ

సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఉమ్మడి మెదక్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పటేల్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. జిల్లా కేంద్రాల్లో 2కే రన్ ర్యాలీలను నిర్వహించారు. సంగారెడ్డి పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు ప్రారంభించి, రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మెదక్ పట్టణంలో ధ్యాన్‌చంద్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించిన రన్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యార్థులతో కలిసి పరుగులో పాల్గొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను అదనపు ఎస్పీ మహేందర్ జెండా ఊపి ప్రారంభించారు. సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన 2కే రన్‌లో సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి యువకులు, అధికారులతో కలిసి ఉత్సాహంగా పరిగెత్తారు.

- సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్/సిద్దిపేట క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి)

కో అంటే కోటి !

5వ పేజీ తరువాయి

మద్యం వ్యాపారులే కాకుండా ఇతరులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి వెనుకాడలేదు. రూ.3లక్షలు వెచ్చించి దరఖాస్తు చేసేందుకు ధైర్యం చేశారు. లాటరీలో షాపులు దక్కించుకోవడంతో అత్యధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పుడు లైసెన్సులు దక్కించుకున్న వారి చుట్టూ మద్యం వ్యాపారులు తిరుగుతూ బేరసారాలు చేస్తున్నారు. పటాన్‌చెరు మండలంలోని ఓ వైన్‌షాపును రూ.కోటిన్నరకు దక్కించుకోగా.. అమీన్‌పూర్‌లోని ఓ షాపు కోసం రూ. 2కోట్ల డీల్ చేస్తున్నారు. సదాశివపేటలో ఒక వైన్ షాపును రూ. 1.20 కోట్లకు, మరో షాపు రూ. కోటికి ఇప్పటికే విక్రయించినట్లు తెలిసింది. గజ్వేల్ ప్రాంతంలో రెండు షాపులను రూ. 80లక్షల చొప్పున దక్కించుకున్నారు. దుబ్బాకలోని ఓ షాపు కోసం పలువురు ప్రయత్నాలు చేస్తుండగా ఆ ధర రూ.కోటి దాకా పలుకుతున్నట్లు చర్చ జరుగుతోంది. ఐడీఏ బొల్లారంలోనూ రూ. కోటిన్నర దిశగా బేరసారాలు జరుగుతున్నట్లు తెలిసింది. చేర్యాల, జగదేవ్‌పూర్, సిద్దిపేటలోనూ పలువురు రూ.75లక్షల పైచిలుకు నగదు చేతబట్టి ప్రయత్నాలు ప్రారంభించారు. మెదక్‌లో ఐదారుగురు సామాన్య వ్యక్తులకు వైన్ షాపులు దక్కాయి. వీరికి రూ.50లక్షల చొప్పున గుడ్‌విల్ ఇస్తామంటూ గాలం వేస్తున్నారు.

ఎన్నికలే కారణం

మద్యం షాపునకు దరఖాస్తు ఫీజు రూ. 3లక్షలు గా నిర్ణయించినప్పటికీ ఆశావహులు వెనక్కు తగ్గలేదు. ఎందుకంటే గ్రామపంచాయతీ, స్థానిక సంస్థలు, మున్సిపల్, సహకార సంఘాల ఎన్నికలు వచ్చే రెండేళ్లలో జరగనున్నాయి. ఈ నాలుగు కీలకమైన ఎన్నికల్లో మద్యం ఏరులైపారే అవకాశం లేకపోలేదు. పైగా వచ్చే డిసెంబరు 1వ తేదీ నుంచే కొత్తవాళ్ల చేతికి షాపులు వస్తున్నాయి. డిసెంబరు లేదంటే జనవరిలో స్థానిక ఎన్నికల నగారా మోగుతుంది. రెండేళ్ల వ్యవధి ఉన్నప్పటికీ వచ్చే ఆరునెలల్లోనే లాభాలు ఆర్జిస్తామని విశ్వాసం పెట్టుకున్నారు. అందుకే షాపులు దక్కనివారు సైతం రూ. కోట్లు వెచ్చించి వైన్ షాపుల కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

చేపలమార్కెట్‌లకు నిధులు కేటాయించాలి

● కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్‌ను కోరిన ఎంపీ రఘునందన్‌రావు



కేంద్ర మత్స్యశాఖ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్‌కు వినతిపత్రం అందించిన ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు/గజ్వేల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : చేపలమార్కెట్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కేంద్ర మత్స్యశాఖ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్‌ను మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు కోరారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఆయన ఎంపీ రఘునందన్‌రావు స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లో చేపల మార్కెట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రూ.5 కోట్లు, సంగారెడ్డి-పటాన్‌చెరు మధ్య ఓపెన్ ఫిష్ మార్కెట్ కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ, మత్స్యకారుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. ఆయన వెంట గజ్వేల్ బీజేపీ నాయకులు కమ్మరి శ్రీను, తదితరులు ఉన్నారు.

నాచగిరి క్షేత్రం.. కార్తీక దీప శోభితం



చెరువు వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

వర్గల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచారం నాచగిరి లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిత్య కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన దేవతామూర్తులలకు ప్రత్యేక పూజలు చేసి, అనంతరం స్వామివారి ముందు శ్రీ ఆకారంలో ఏర్పాటు చేసిన కార్తీక దీపాలను భక్తులు వెలిగించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు, అర్చకులు పాల్గొన్నారు.

మార్డి పెద్దచెరువు కబ్జాపై రైతుల ఆందోళన

కల్హేర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మార్డి పెద్దచెరువు ఎఫ్‌టీఎల్‌లో చెరువు భూమి కబ్జాపై ఆయకట్టు రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎక్స్‌వేటర్‌తో కట్టలు వేయడాన్ని అడ్డుకున్నారు. అయితే, తన పట్టా భూమి అయినందునే తాను కట్టలు వేశానని, తన భూమి తనకు చూపించాలని రైతు గోవర్ధన్‌రెడ్డి కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల ప్రకారం సర్వే చేసిన రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సదరు భూమి ఎఫ్‌టీఎల్ పరిధిలోనిదని తేల్చారు. అయినప్పటికీ తిరిగి అదే భూమిలో పనులను చేపట్టగా ఇతర రైతులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని, సమస్య పరిష్కారం కాకుంటే ఆందోళన చేపడతామని మార్డి గ్రామ రైతులు హెచ్చరించారు.



గుమ్మడిదలలోని కానుకుంట చౌరస్తాలో పని కోసం ఎదురుచూస్తున్న కూలీలు

ఉపాధి వేట.. గుమ్మడిదల బాట

వ్యవసాయ, పారిశ్రామిక పనులకు నిలయం

పక్క జిల్లాల నుంచి కానుకుంట చౌరస్తాకు వందల మంది కూలీల రాక

మహిళా కూలీలకు ఆర్టీసీ ఉచిత సేవలతో ఊరట

గుమ్మడిదల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడ బ్యాగులతో నిలబడి కనిపిస్తున్న మహిళలు ఏ ఫంక్షన్‌కో, రాజకీయ పార్టీల మీటింగ్‌లకో వెళ్తున్నారనుకుంటే పొరపాటే. వారంతా రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కూలీలు. పొట్టకూటి కోసం సద్ది (భోజనం)ని సంకనేసుకుని, కూలి పని కోసం పక్క జిల్లాల నుంచి సూర్యోదయం కాకముందే, ఉదయం 6 గంటలకే ఈ చౌరస్తాలో నిలబడి, ఎవరు పనికి పిలుస్తారోనని ఎదురుచూసే శ్రామికులు. కొన్నేళ్లుగా ఎంతో మంది నిరుపేద కూలీల ఉపాధి స్థానంగా మారిన ఈ అడ్డాయే గుమ్మడిదల గ్రామంలోని కానుకుంట చౌరస్తా.



గుమ్మడిదలలో టమోటాలు ఏరుతున్న మహిళా కూలీలు

అన్ని రకాల పనులకు నిలయం

సంగారెడ్డి జిల్లాలోని గుమ్మడిదల వ్యవసాయ, కొంతమేర పారిశ్రామిక ప్రాంతం కావడంతో పాటు పట్టణ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో అన్ని రకాల పనులకు నిలయంగా మారింది. ముఖ్యంగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని కొల్చారం, కౌడిపల్లి, నర్సాపూర్, వెల్దుర్తి మండలాల నుంచి పలు తండాల నుంచి వందల సంఖ్యలో కూలీలు ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ఇక్కడికి చేరుకుంటారు. ఆ ప్రాంతాల్లో ఉపాధి దొరకకపోవడమే ఈ వలసకు ప్రధాన కారణం. గుమ్మడిదలకు వస్తే ఏదో ఒక కూలి పని దొరుకుతుందనే కూలీలు ఇక్కడికి ఆశతో వస్తున్నారు.

ఉదయమే కూలీల సందడి

ప్రతిరోజూ ఉదయం కానుకుంట చౌరస్తాలో కూలీల సందడి నెలకొంటుంది. వ్యవసాయ పనులు, ఇతర పనులు చేయించుకునేందుకు రైతులు, పలువురు ఇక్కడికి వచ్చి కూలీలతో మాట్లాడి, వారిని తమ పొలాలకు లేదా ఇతర పనుల వద్దకు తీసుకెళ్తారు. వరి నాట్ల సమయంలో మహిళలకు రోజుకు రూ.800, మగవారికి రూ.వెయ్యి వరకు కూలి లభిస్తుంది. ఈ పనులు దొరకని వారు పారిశ్రామికవాడలోని పరిశ్రమలలో కాంట్రాక్టు పనికి వెళ్లి రోజుకు రూ.500 చొప్పున సంపాదిస్తుంటారు. మరికొందరు మేస్త్రీ పనికి వెళ్తుంటారు. ప్రస్తుతం మిరపకాయలు తెంపడం, టమోటాలను కోయడం, కలుపుతీత వంటి వ్యవసాయ పనులు మహిళా కూలీలకు దొరుకుతుండగా, ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోజుకు రూ.400 కూలి సంపాదించుకుంటున్నారు. మహిళలైతే ఉచిత ఆర్టీసీ బస్సు సేవలతో ఊరట పొందుతున్నారు. ఉచిత ప్రయాణం కల్పించడంతో గుమ్మడిదల చేరుకోవడం సులభమైందని, ఇది చాలా సాయం అవుతోందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏదో పని దొరుకుతుంది



గుమ్మడిదల ప్రాంతంలో బతకడానికి ఏదో ఒక పని దొరుకుతుందని ఆశతో ఇక్కడికి వస్తాం. ఇంట్లో పిల్లల్ని చదివించడానికి, తినడానికి సరిపోవడానికి పనిచేయడం చాలా అవసరం. మా ప్రాంతంలో వేరే ఉపాధి లేకపోవడం మా దౌర్భాగ్యం.

- దానీ, జలాల్‌పూర్, మెదక్ జిల్లా

పనికి తగ్గ కూలి కచ్చితంగా ఇస్తారు



కొన్నేళ్లుగా గుమ్మడిదల గ్రామానికి కూలీ పని కోసం వస్తున్నాను. వ్యవసాయ ప్రాంతంగా గుమ్మడిదల గ్రామ ఉండడంతో ఇక్కడ పనులు మెండుగా ఉంటాయి. మహిళ కూలీలకు ఏదో ఒక పని ఇక్కడ దొరుకుతుంది. ఈ ప్రాంత రైతులు కూలీలను మంచిగా చూసుకుంటారు. పనికి తగిన కూలి డబ్బు కచ్చితంగా ఇస్తారు.

- సరిత, పోతిరెడ్డి పాలెం తండా, మెదక్ జిల్లా



పని ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న మహిళా కూలీలు

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో విద్యార్థి ఆత్మహత్య

● వసతిగృహంలో ఉరేసుకున్న బానోత్ మహేందర్

● మృతుడిది సూర్యాపేట జిల్లా పెద్దరాజు తండా



బానోత్ మహేందర్ (ఫైల్)

పుల్‌కల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహంలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం జరిగింది. సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామ పంచాయతీ పెద్దరాజు గిరిజన తండాకు చెందిన బానోత్ మహేందర్(20) జేఎన్టీయూలో సీఎస్ఈ (ఏఐఎంఎల్) మూడో సంవత్సరం చదువుతున్నారు. కళాశాల ప్రాంగణంలోని వసతిగృహ సముదాయంలోని మానేరు బ్లాక్ 304 గదిలో ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సహచర విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అందరూ ఎవరి గదుల్లోకి వారు వెళ్లిపోయారు. అనంతరం మహేందర్ తన గదిలోనే టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మహేందర్ తరగతులకు రాకపోవడంతో తోటి విద్యార్థులు గదికి వెళ్లి చూడగా తలుపులు లోపలి నుంచి మూసి ఉండటంతో పగులగొట్టారు. అప్పటికే ఫ్యాన్‌కు మహేందర్ వేలాడుతూ కనిపించాడు. ఈ విషయాన్ని విద్యార్థులు వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు, అధ్యాపకులు, కేర్ టేకర్‌కు సమాచారం అందించారు. కొనఊపిరితో ఉన్న మహేందర్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథరాజును వివరణ కోరగా మహేందర్ బాగా చదివేవారని, అన్ని సెమిస్టర్లలోనూ మంచి మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని పేర్కొన్నారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ విశ్వజన్, ఆర్డీవో పాండు, తహసీల్దార్ నామాల కిష్టయ్య జేఎన్టీయూ క్యాంపస్‌కు చేరుకున్నారు. క్లూస్ టీం సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. సంగారెడ్డి జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి చిన్నేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్ఐ ఎన్.విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు బానోత్ మహేందర్ కుటుంబ కలహాల వల్లనే ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలుస్తున్నది. స్వగ్రామంలో ప్రేమ వ్యవహారమే ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు. అయితే, తల్లిదండ్రులు, సోదరులు మాత్రం అలాంటివేమీ లేవని చెబుతున్నారు.

సింగూరుకు పెరిగిన వరద

పుల్‌కల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం మరింతగా పెరగడంతో శుక్రవారం మరో గేటు ఎత్తారు. ఇప్పటికే మూడు క్రస్ట్ గేట్ల ద్వారా వరద జలాలను దిగువకు వదులుతుండగా, ప్రవాహం పెరగడంతో 10వ క్రస్ట్ గేట్‌ను రెండు మీటర్లు ఎత్తారు. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద జలాలు పెద్దఎత్తున వచ్చి చేరుతున్నాయి. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 33,765, అవుట్‌ఫ్లో 35,864 క్యూసెక్కులుగా నమోదైంది.



ఏడుపాయల ఆలయాన్ని తాకుతూ ప్రవహిస్తున్న మంజీర

ఏడుపాయలలో మళ్లీ పోటెత్తిన మంజీర

పాపన్నపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : ఘనపురం ఆనకట్ట (వనదుర్గా ప్రాజెక్టు)పై నుంచి వరద జలాలు దిగువకు పారుతుండడంతో ఏడుపాయల అమ్మవారి ఆలయం ముంపునకు గురైంది. వరద జలాలు పోటెత్తడంతో ఆలయం ముందు నుంచి ప్రవహిస్తుంది. ఆలయం మూసి వేయడంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి భక్తులు పూజలు చేస్తున్నారు.

ఎట్టకేలకు నిండిన బందారం చెరువు

కొండపాక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బందారం ఊరచెరువు ఎట్టకేలకు నిండి, మత్తడి పారుతోంది. రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని దాదాపు అన్ని చెరువులు నిండగా ఇందులో మాత్రం సగం వరకే నీరు చేరింది. చెరువులోకి నీరు వచ్చే ప్రాంతంలో వర్షాలు తక్కువగా కురవడమే దీనికి కారణం. అయితే, బుధవారం కురిసిన భారీ వర్షానికి చెరువులోకి వరద చేరి నిండుకుండలా మారింది. మత్తడి పారుతుండడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి సాగునీటి కాలువ ద్వారా చెరువులను నింపాలని కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని, మల్లన్నసాగర్, తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీరు రాకున్నా వరుణుడు కరుణించడంతో చెరువు నిండిందని రైతులు పేర్కొన్నారు.



మత్తడి పారుతున్న బందారం ఊరచెరువు

జాతీయ సాహస శిబిరానికి నర్సాపూర్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నర్సాపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన విద్యార్థి జాతీయస్థాయి సాహస శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న జరుపుల ప్రభాకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన అడ్వెంచర్ క్యాంపు సెలక్షన్‌లో పాల్గొన్నాడని పేర్కొన్నారు. తన సామర్థ్యం చాటి ప్రథమ స్థానంలో నిలిచి, జాతీయస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి సురేష్, అధ్యాపక బృందం విద్యార్థిని అభినందించారు.

రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీలో దుబ్బాక విద్యార్థి ప్రతిభ

దుబ్బాక, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి (నేషనల్ యూనిటీ డే) సందర్భంగా హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో దుబ్బాక విద్యార్థి ప్రతిభ కనబరిచింది. రాష్ట్రవ్యాప్తంగా 40 పాఠశాలలు, కళాశాలలు పాల్గొన్న ఈ పోటీలో పైనల్‌కు చేరుకుని మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు వర్షిత, శివ్య, స్ఫూర్తి, నానేష్, అశ్వంత్‌లకు తృతీయ బహుమతి లభించింది. వీరికి మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ, రాష్ట్రపతి నిలయం అధికారి రజినిప్రియ బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభ చూపిన లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులకు అందజేస్తున్న బహుమతి

ఇంటర్వ్యూ

రేపు మల్లకంబ్ ఎంపికలు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నవంబర్ 2వ తేదీన మల్లకంబ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌందర్య తెలిపారు. అండర్ 14, అండర్ 17 బాలబాలికల ఉమ్మడి మెదక్ జిల్లా మల్లకంబ్ ఎంపికలు సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసినట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9948110433 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్కూల్ ఫెసిలిటీ గ్రాంట్ (పారిశుద్ధ్య కార్మికుల నిధులు) వెంటనే చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. 4నెలలుగా బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే పాఠశాలలకు మంజూరు చేయాలని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించేంత వరకు మధ్యాహ్నభోజనం వంట బంద్

చేర్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు అందించేంత వరకు మధ్యాహ్న భోజన వంట బంద్ చేస్తామని పేర్కొంటూ చేర్యాల మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం చేర్యాల ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ మాట్లాడుతూ 9నెలలుగా కోడిగుడ్ల బిల్లులు, 5నెలలుగా కూరగాయల బిల్లులతో పాటు వేతనాలు సకాలంలో చెల్లించకపోవంతో మధ్యాహ్నభోజన కార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో బండకింది అరుణ్‌కుమార్, దండెబోయిన భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్ రూరల్:** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని వేతనాలు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ గర్ల్స్ జడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిల్లులు రాక అప్పులు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారని తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించని పక్షంలో ప్రభుత్వ పాఠశాలలో భోజనం వడ్డించడం బందు పెడతామని హెచ్చరించారు.

నష్టపోయిన పంటలపై పూర్తిస్థాయి సర్వే చేయాలి

హుస్నాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలో నష్టపోయిన పంటలపై పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణ శివారులో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ. 10 వేల పరిహారం ఇస్తామని సీఎం ప్రకటించడం సరికాదని, ఎకరానికి కనీసం రూ. రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదలతో నలుగురు మృతి చెందారని, వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, తదితరులున్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

గజ్వేల్ రూరల్ అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వలన నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని ఏకరానికి 10 వేల నుంచి 50 వేలకు పెంచాలి డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామిప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, శుక్రవారం గజ్వేల్ మండల పరిధిలోని గిరిపల్లి,రంగంపేట,ధర్మరెడ్డి పల్లి గ్రామాల్లో నీట మునిగిన పంటలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పొన్నాల కుమార్‌తో కలిసి పరిశీలించారు, గామాలలో వరద రావడంతో జనజీవనం స్తంభించిపోయిందన్నారు. చేతికొచ్చిన పంట నేల రాలడంతో ఆందోళనకు గురైన రైతులను ఆదుకొని ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించి రైతులకు అండగా నిలవాలన్నారు.

ప్రభుత్వాలు మారినా..

నిర్మాణానికి నోచుకోని మురుగుకాలువ

- గత పదేళ్ల ప్రభుత్వంలో పట్టించుకోని పాలకులు.. నేటికీ అదే పరిస్థితి
- ములుగు అంబేడ్కర్ చౌరస్తా పరిసరాల్లో దుర్వాసనతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- అధికారులు, నాయకులు పట్టించుకోవాలని వేడుకోలు



ములుగు అంబేడ్కర్ చౌరస్తాలో పైకప్పులేని మురుగు కాలువ, చెత్త, చెదారంతో నిండిపోయిన దృశ్యం

ములుగు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నిసార్లు ప్రభుత్వాలు మారినా మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మురుగుకాలువ నిర్మాణం జరగడంలేదు. గత దశాబ్ద కాలంలో నాటి ప్రభుత్వం కాలువ నిర్మాణం చేయలేకపోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా చొరవ తీసుకొని మురుగుకాలువ నిర్మాణం చేపడుతుందనుకుంటే అదీ జరగలేదు. కాగా మురుగుకాలువ నిర్మాణంతో పాటు అండర్‌డ్రైనేజ్ నిర్మాణం చేస్తే దుర్వాసన రాకుండా ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ములుగు అంబేడ్కర్ చౌరస్తాలో మురుగు కాలువ నిర్మించకపోవడంతో నిత్యం మురుగునీటి కంపుతో పరిసరాల్లోని ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రాష్ట్ర మంత్రులు, అధికారులు ఎవరు ములుగు మండలకేంద్రానికి వచ్చినా అంబేడ్కర్ చౌరస్తాలో మురికి కాల్వ నిర్మాణం దర్శనమిస్తుంది. ఈ విషయాన్ని జిల్లా అధికారులు పర్యవేక్షణ చేసి ప్రత్యేక నిధులు కేటాయించి కాల్వ నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాలువ పైకప్పులేక ప్రమాదాలు

గత వర్షాకాలంలో కొందరు మురుగుకాలువ పైకప్పు లేకపోవడంతో ప్రమాదవశాత్తు అందులో పడి వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి చావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా కుంటలో తేలిన సందర్భాలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాల నివారణకు వెంటనే అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం కాలువ నిర్మాణం కాక ఓపెన్‌గా ఉండడం వల్ల అందులో చెత్తా చెదారం చేరి పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతున్నది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం వల్ల నిత్యం ప్రజలు అధికంగా సంచరించే అంబేడ్కర్ చౌరస్తాలో స్వచ్ఛవాతావరణం కల్పించేందుకు అవకాశాలున్నాయని, అందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మురికి కాలువ నిర్మాణం చేపట్టాలి

గత ప్రభుత్వ హయాంలో మురుగు కాలువ నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో చుట్టుపక్కలవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా స్థానిక నాయకులు చొరవ తీసుకొని మురుగు కాలువ నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలని కోరుతున్నాం.

- మంగలి అశోక్, ములుగు

ఇందిరాగాంధీకి ఘన నివాళి


సిద్దిపేటలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూజల హరికృష్ణ, అత్తు ఇమామ్


హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఇందిరా చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట/గజ్వేల్/హుస్నాబాద్/చేర్యాల/కొమురవెల్లి/కోహెడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని శుక్రవారం జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో ఇందిరాగాంధీ చిత్రపటాలు, విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రధానిగా ఆమె దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పేద, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన ఇందిరాగాంధీ దేశం కోసం చేసిన త్యాగం ఎంతో గొప్పదని కొనియాడారు.


గజ్వేల్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు జరిగేలా చూడాలి


నంగునూరు: రాజగోపాల్ పేట పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నంగునూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ పేర్కొన్నారు. నంగునూరు మండలం రాజగోపాల్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై స్థానిక వైద్యాధికారి డాక్టర్ సరితను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పారామెడికల్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. విధుల పట్ల చేస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా ఏఎన్ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ల్యాబ్, ఫార్మసిస్ట్ గదులను పరిశీలించారు. డీఎంహెచ్‌వో వెంట డాక్టర్ సరిత, డాక్టర్ ఉదయ్ కుమార్ హెచ్‌ఈవో స్వామి ఉన్నారు.

పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీ

మద్దూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డెలివరీలు అయ్యే విధంగా చూడాలని హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం మద్దూరు, లద్నూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

● ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సిద్దిపేటలో నూతన బస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పిండ ప్రదానం చేసి నిరసన తెలియజేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పెండింగ్ లో ఉన్న రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేస్తామని గొప్పలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు హామీలను నెరవేర్చటం లేదని ప్రశ్నించారు. గత ఆరేళ్లుగా స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో వేలాది మంది పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు.

సీఎం వెంటనే రాజీనామా చేయాలని లేదా ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ పవన్, రాష్ట్ర వనవాసి కోకన్వీనర్ పరశురాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణిందర్, నగర కార్యదర్శి చరణ్ కళాశాల అధ్యక్ష కార్యదర్శులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ మైదానంలో నిర్వహించిన 2కే రన్‌లో ఇన్‌స్పెక్టర్లు


హుస్నాబాద్ జూనియర్ కళాశాలలో ఐక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా రాష్ట్రీయ ఏక్తాదివస్


మర్కూక్‌లో 2కే రన్ విజేతలకు నగదు అందజేస్తున్న ఎస్ఐ దామోదర్


వర్గల్ నుంచి గౌరారం రాజీవ్ రహదారి వరకు పోలీసులు, విద్యార్థుల రన్

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా జాతీయ సమైక్యతాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండల కేంద్రాల్లో విద్యాసంస్థలు, పోలీసులు, పలు సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. ఉక్కు సంకల్పంతో 538 సంస్థానాలను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసి దేశ సమైక్యత సమగ్రతల కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని కొనియాడారు. యువత ఆయన ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయా మండలాల్లో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం పేరిట చేపట్టిన 2కే రన్‌లో అధికారులు, యువత, విద్యార్థులు, అధ్యాపకులు పెద్దసంఖ్యలో పాల్గొని నిబద్ధతను చాటారు. వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన ఆశయ సాధనకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. పలు కళాశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచినవారికి బహుమతులను అందజేశారు.

- న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవం

సిద్దిపేట రూరల్/చేర్యాల/కొండపాక, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రజలందరికీ సమానమైన హక్కులు కల్పించిందని, గ్రామాల్లో కుల వివక్ష లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించాలని అధికారులు గ్రామస్థులకు సూచించారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ అధికారి వెంకటరెడ్డి పౌరహక్కుల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మానవ హక్కులు, చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు సమావేశం ఏర్పాటుచేశారు. ఇతరుల హక్కులకు భంగం కలిగించకూడదని అవగాహన కల్పించారు. కొండపాక మండలం రాంపల్లి గ్రామంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డేలో తహసీల్దార్ ఎన్ మల్లికార్జున్ రెడ్డి, ట్రైనీ అడిషనల్ కలెక్టర్ భవ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంతమైన వాతావరణంలో కలిసిమెలిసి జీవించాలని సూచించారు.

ఆడబిడ్డ వివాహానికి పుస్తె మట్టెలు


పుస్తె మట్టెలు అందజేస్తున్న కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం దంపతులు

సిద్దిపేట క్రైం అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూరుకుల గ్రామానికి చెందిన కొమ్ము భవాని - కనకయ్య కూతురు దివ్యశ్రీ వివాహానికి సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం ఆయన భార్య మాజీ కౌన్సిలర్ స్వప్న పుస్తె, మట్టెలు, గాజులు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బ్రహ్మం కుటుంబానికి గ్రామ మాజీ సర్పంచ్ కవిత-రవీందర్ మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీధర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం

దుబ్బాక, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి చేర్వపూర్ వార్డుకు చెందిన మూర్తి రాజేందర్‌రెడ్డి దంపతులు రూ. 1.25 లక్షలు విరాళంగా అందించారు. శుక్రవారం అయ్యప్ప ఆలయ చైర్మన్ చింత రాజు గుప్తాకు ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు హర్షం వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఫాక్స్ చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్ అన్నారు. గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి రింగ్‌రోడ్డుపై ఫాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. దళారులకు పంటలను అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు.


గతంలో సర్వే చేపట్టిన నీటిపారుదలశాఖ అధికారులు

ఆక్రమణలో నల్ల(కొండ)పోచమ్మ చెరువు!

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఎంతో మంది ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులు ఆక్రమణలు గుర్తించినా చర్యలు తీసుకోవడానికి వెనకంజ వేశారు. తాజాగా నల్లపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గూడెపు మహేశ్ ఫిర్యాదు మేరకు రెండు రోజుల క్రితం ఈఈ కవిత, డీఈఈ శ్యామ్ చెరువును పరిశీలించి, సర్వే చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత అనుభవాల నేపథ్యంలో, ఈసారైనా అధికారులు చర్యలు తీసుకుంటారా లేక షరామామూలుగానే వదిలేస్తారా అన్నది ఆ కొండ (నల్ల) పోచమ్మకే తెలియాలి.

ఇష్టారాజ్యంగా ఆక్రమణలు

నల్లపోచమ్మ చెరువు శిఖం భూములను ఇష్టానుసారం ఆక్రమణలకు పాల్పడ్డారు. గతంలో నీటిపారుదల శాఖాధికారులు సర్వేచేసి హద్దులు నిర్ధారించి ఆక్రమణలు గుర్తించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చెరువుతో పాటు ఆలయ భూముల పరిరక్షణకు తమ పాలకమండలి తరఫున నీటిపారుదలశాఖ ఎస్ఈకి ఫిర్యాదు చేశాం. దీంతో ఈఈ, డీఈ వచ్చి పరిశీలించారు. తాత్సారం వహించినా, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకుంటే సహించబోం.

- మహేశ్, ఆలయ చైర్మన్, నాగపురి

సర్వే మ్యాపులు మా వద్ద లేవు

నల్లపోచమ్మ చెరువు శిఖం భూముల సర్వేకు సంబంధించిన మ్యాపులు మావద్ద అందుబాటులో లేవు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎస్ఈ ఆదేశానుసారం చెరువు సందర్శించాం. అన్నింటిని పరిశీలిస్తున్నాం.

- శ్యామ్, ఐబీ డీఈ

డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జరిమానా

● ఒకరికి ఐదు రోజుల జైలు

గజ్వేల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం మురళి ఆధ్వర్యంలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 9 మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరు పరచగా మొత్తం రూ. 64వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. వారిలో ఒకరికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారు. ట్రాఫిక్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినవారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరు పరచగా విచారణ అనంతరం ఆరుగురికి రూ.10వేల చొప్పున, ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమానా విధించారు. ఒకరికి రూ.వేయి జరిమానాతో పాటు ఐదురోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించినట్లు తెలిపారు.

ఏడుగురు గంజాయి నిందితుల రిమాండ్: ఏసీపీ

గజ్వేల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతూ... విక్రయించేందుకు యత్నిస్తున్న ఏడుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింలు తెలిపారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసుల ఆధ్వర్యంలో గజ్వేల్, రాయపోల్, తొగుట పోలీస్‌స్టేషన్ల పరిధిలో గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్నారనే సమాచారంతో గజ్వేల్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, సిబ్బంది, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. గజ్వేల్ పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన మహ్మద్ అంజద్(20), ఇందిరా ప్రియదర్శిని కాలనీకి చెందిన టంగుటూరి శివానందం(23), ఎస్సీ కాలనీకి చెందిన పనీర్ తేజ(25), డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన మహ్మద్ సోహైల్(23), రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన మద్దికుంట గణేశ్(30), బట్టి బాలకృష్ణ(22), తొగుట మండలం గోవర్ధనగిరికి చెందిన ఉప్పరి ఉదయ్(20)లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 800 గ్రాముల గంజాయి, 7మొబైల్ ఫోన్లు, 3 బైక్‌లు, ఒక గంజాయి తాగడానికి ఉపయోగించే గొట్టంను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉత్తమ సేవలు చిరకాలం నిలుస్తాయి : ఎమ్మెల్యే పల్లా


పదవీవిరమణ పొందిన హెచ్‌ఎం ఉమారాణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే

చేర్యాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ అందించిన ఉత్తమసేవలు చిరకాలం నిలుస్తాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల మండలం కడవేరుగు ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఉమారాణి పదవీ విరమణ వీడ్కోలు సమావేశం శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి పాటుపడి ఉమారాణి మండల, జిల్లా ఉత్తమ అవార్డులు కైవసం చేసుకోవడం ఆదర్శప్రాయమన్నారు.

మల్లన్న ఆలయ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ


సూపరింటెండెంట్ శ్రీరాములును సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

కొమురవెల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సిరిగిరి శ్రీరాములు శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆలయపాలకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సిరిగిరి శ్రీరాములును ఆలయాధికారులు, అర్చకులు, ధర్మకర్తలు శాలువాలతో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్తాం: బీజేపీ

కోహెడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో వాటిల్లిన పంట నష్టాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్తామని బీజేపీ జిల్లా కౌన్సెలింగ్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం, మండల అధ్యక్షుడు జాలిగాం రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో వర్ష ప్రభావంతో దెబ్బతిన్న పంటలను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసి ఉంటే ఈ మొంథా తుఫాన్ తో నష్టపోయిన రైతులకు ఆర్థిక నష్టాల నుంచి కాపాడేందుకు సులభతరమయ్యేదని వివరించారు. ఆకాల వర్షానికి కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయాలని కోరారు. అన్ని విపత్తులకు పంట నష్టపరిహారం అందించే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ఈసారైనా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చిగురు రాజిరెడ్డి, బండ సుమన్ యాదవ్, ఎడమల రాజు రెడ్డి, ఎసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, రైతులు ఉన్నారు.

హుస్నా'బాధ' తెలుసుకునేలా

(5వ పేజీ తరువాయి)


సర్వే నిర్వహిస్తున్న పబ్లిక్ హెల్త్ అధికారులు

ముంచెత్తుతున్న వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించడంతో శుక్రవారం హైదరాబాద్ మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులు పట్టణంలో సర్వే నిర్వహించారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ప్రధాన రహదారితో పాటు పలు కాలనీలు జలమయం కావడంతో, అధికారులు హన్మకొండ రోడ్డు పెట్రోల్ బంకు, అంబేడ్కర్ చౌరస్తా, మార్కెట్ యార్డు, బస్టాండ్, పోలీస్ స్టేషన్, సెయింట్ జోసెఫ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతాల్లో వరద నీటి మళ్లింపునకు తీసుకోవాల్సిన చర్యలపై సర్వే చేశారు. ఈ మేరకు దాదాపు రూ. 80కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిసింది. పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈలు మహేశ్, తిరుపతి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, ఎంఏఈలు ఈసర్వేలో పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

మొంథా తుపాను కారణంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హుస్నాబాద్ మండలంలో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. రాయపోల్ మండలంలో తడిసిపోయిన మొక్కజొన్నలు, ధాన్యాన్ని గజ్వేల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బాబూనాయక్ పరిశీలించారు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి విక్రయ కేంద్రాల వద్దకు తీసుకెళ్లాలని రైతులకు సూచించారు. మద్దూరు మండలంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల్ని వ్యవసాయాధికారి రామకృష్ణ పరిశీలించారు. మద్దూరు, లద్నూరు గ్రామాల్లో నేలకొరిగిన పంటలను పరిశీలించి, సుమారు 60 ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు.


సర్వే నిర్వహిస్తున్న పబ్లిక్ హెల్త్ అధికారులు

చకచకా ధాన్యం కొనుగోళ్లు

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు కొనుగోలు కేంద్రంలో వర్షంతో తడిసిన ధాన్యం కొనుగోళ్లు చక చకా జరిగాయి. సివిల్ సప్లయ్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో గురు, శుక్రవారాల్లో వందకు పైగా హమాలీలను రంగంలోకి దించి 00 మందికి పైగా రైతుల నుంచి దాదాపు 526 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని రైస్ మిల్లులకు లారీల ద్వారా తరలించారు. సివిల్‌సప్లయ్ డిప్యూటీ కమిషనర్ కొండలరావు, జీఎం నాగేశ్వర్‌రావు కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించారు.